కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ

- మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

శ్రీనివాస్‌యాదవ్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ రూరల్, ఫిబ్రవరి 7: కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బీఆర్ఎస్ తొగర్రాయి గ్రామశాఖ అధ్యక్షుడు అమరబోయిన శ్రీనివాస్‌యాదవ్ అనారోగ్యం కారణంగా శస్త్ర చికిత్స చేయించుకోగా, శుక్రవారం ఆయనను మల్లయ్యయాదవ్ పరామర్శించారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని, అధైర్యపడొద్దని మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చింతా కవితారెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శెట్టి సురేశ్‌నాయుడు, మాజీ సర్పంచులు పొట్ట విజయకిరణ్, దొంగల లక్ష్మీనారాయణ, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ముత్తవరపు రమేశ్, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే.ఉద్దండు, బీఆర్ఎస్ పట్టణ యూత్ అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్, మాదాల ఉపేందర్, కిరణ్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి'

కోదాడ టౌన్: మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి

కోదాడ టౌన్, ఫిబ్రవరి 7: వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి(జాక్టో) అభ్యర్థి పూల రవీందర్‌ను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని జాక్టో సెక్రటరీ జనరల్ కె.కృష్ణుడు, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వతరెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడ డివిజన్‌లో ప్రచారం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పూల రవీందర్‌ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బంధం వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు ఓరుగంటి పెద్ద నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గరిడేపల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో పూల రవీందర్‌ను గెలిపించాలని కోరుతూ ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వతరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులను కలిసి ప్రచారం చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కోదాడ రూరల్, ఫిబ్రవరి 7: తాళం వేసిన ఇంట్లో పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన పట్టణ పరిధిలోని బాలాజీ నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీ నగర్‌లో నివాసం ఉంటున్న గుజ్జర్లపూడి శ్రీనివాసరావు, భార్య కృష్ణవేణి శుక్రవారం ఇంటికి తాళం వేసి పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. గమనించిన గుర్తు తెలియని దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న 4 ఉంగరాలు, 2 బంగారు గాజులు,రూ.50 వేల నగదు అపహరించారు. తిరిగి వారు ఇంటి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండటంతో దొంగతనం జరిగినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సాగర్ కాల్వలో మహిళ మృతదేహం లభ్యం

నడిగూడెం, ఫిబ్రవరి7: మండల పరిధిలోని చాకిరాల గ్రామం వద్ద నాగార్జునసాగర్ ఎడమ కాల్వలో శుక్రవారం ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. ఇటీవల మృతిచెందిన నడిగూడెం మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎలక చక్రారెడ్డి భార్య నారాయణమ్మ మృతదేహంగా స్థానికులు గుర్తించారు. ఆమె ప్రస్తుతం సూర్యాపేటలోని జమ్మిగడ్డ ప్రాంతంలో నివాసం ఉంటున్నదని, నాలుగు రోజుల క్రితం ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని తెలిపారు. కాగా, ఈ విషయమై నారాయణమ్మ కుమారుడు పాపిరెడ్డి సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆమె తప్పిపోయిన రోజు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని కుమారుడికి అప్పగించి, కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు స్థానిక ఎస్ఐ అజయ్‌కుమార్ వెల్లడించారు.

రమాబాయి అంబేద్కర్‌కు నివాళి

కోదాడలో రమాబాయి అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సామాజిక కార్యకర్త రమేశ్ తదితరులు

నేరేడుచర్ల, ఫిబ్రవరి 7: సామాజిక సమానత్వం కోసం రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేద్కర్ సతీమణి రమాబాయి అంబేద్కర్ ఎంతో కృషి చేశారని పలువురు వక్తలు కొనియాడారు. రమాబాయి అంబేద్కర్ 127వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నేరేడుచర్లలోని ప్రధాన కూడలి వద్ద ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఎడవల్లి చంద్రయ్య, యడవల్లి అరుణ్, పున్నయ్య, ఎస్.రామకృష్ణ, ఎం.రామయ్య, ఎన్.మనోజ్, డి.రవి, ఎం.విజయ్, మధు, జాను, సంతోశ్ పాల్గొన్నారు.

కోదాడ/కోదాడ రూరల్: సామాజిక కార్యకర్త గుండెపంగు రమేశ్ ఆధ్వర్యంలో కోదాడలో రమాబాయి అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. డాక్టర్ గౌసియా, గంధం యాదగిరి, రంగయ్య, పాండు, ఇస్మాయిల్, రాంబాబు, ప్రేమ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

తుంగతుర్తి: అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

కోదాడ టౌన్: స్వపరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

కోదాడ టౌన్, ఫిబ్రవరి 7: కోదాడ పట్టణ పరిధి బాలాజీ నగర్‌లోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులుగా, అధికారులుగా విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి, ప్రధానోపాధ్యాయురాలు కె.నాగజ్యోతి, ఉపాధ్యాయులు ఉషారాణి, సుజాత, రేణుక, పద్మాబాయి, స్వరూప, ప్రియాంక, స్వాతి, నాగేశ్వరరావు, సరిత, లలిత పాల్గొన్నారు.

తుంగతుర్తి: మండల కేంద్రంలోని శ్రీవిద్యాభారతి ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా, అధికారులుగా, ప్రజాప్రతినిధులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. అంతకుముందు మెయిన్‌రోడ్డుపై ఉన్న అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఈఓ బోయిని లింగయ్య, హెచ్ఎం మల్లయ్య, పాఠశాల డైరెక్టర్ నజీర్, ఉపాధ్యాయులు లింగమూర్తి, సరిత, సురేశ్, ఈరోజీ, అనిత, ఉమ, సునీత, రాధ, మున్ని, స్వప్న పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నాం'

సమావేశంలో మాట్లాడుతున్న చింతా బాబుమాదిగ

కోదాడ రూరల్/కోదాడ టౌన్, ఫిబ్రవరి 7: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు చింతా బాబుమాదిగ అన్నారు. కోదాడలోని తన నివాసంలో శుక్రవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడిన మందకృష్ణ మాదిగకు, మేడిపాపయ్య మాదిగకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. సమావేశంలో నాయకులు బాణాల అబ్రహం, కందుకూరి నాగేశ్వరరావు, బొల్లెపోగు స్వామి, నారకట్ల ప్రసాద్, బొల్లెపోగు కాశయ్య, పిడమర్తి బాబురావు, సోమపంగు శ్రీను, ఏర్పుల చిన్ని, చంటి పాల్గొన్నారు.

వరికి రెండోసారి యూరియా వేయాలి

- జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి

పెన్‌పహాడ్: వరి కంకులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 7: యాసంగిలో నవంబర్ 15వ తేదీ నుంచి డిసెంబర్ 20వ తేదీ మధ్యనే వరి నారు పోసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి అన్నారు. అంతకు ముందు పోస్తే చలి కారణంగా తల్లి వేరు ఎదగదని, తర్వాత పోస్తే తల్లి వేరు త్వరగా ఈనుతుందని తెలిపారు. యాసంగిలో ముందే వరి కంకులు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో శుక్రవారం మండల పరిధిలోని పొట్లపహాడ్, అనంతారం, దూపాడ్ గ్రామాల్లో ఆయన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు చివరిగా దమ్ము చేసేప్పుడు డీఏపీ వేసిన తర్వాత యూరియాను వేయకపోవడంతో పొలాల్లో ఉన్న భాస్వరం నిల్వ ఎక్కువై తల్లి కర్ర ముందే ఈనడం జరుగుతుందన్నారు. ఈ సమస్య నుంచి బయట పడాలంటే 20-25 రోజుల నారు మాత్రమే నాటుకోవాలని, ఒకవేళ తల్లి, పిల్ల కర్ర త్వరగా ఈనడం గమనిస్తే రెండో దఫా యూరియా వేయాలని తెలిపారు. కార్యక్రమంలో కంపసాగర్ కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్, ఎంటమాలజిస్ట్ రాములమ్మ, డాక్టర్ సంధ్య పాల్గొన్నారు.

వరి పైర్లను పరిశీలించిన శాస్త్రవేత్తలు

నేరేడుచర్ల: మండలంలోని పెంచికల్‌దిన్నె, దిర్శించర్ల గ్రామాల్లో వరి పైర్లను కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలు శుక్రవారం పరిశీలించారు. పొలాల్లో ముందస్తుగా పిలకలు వచ్చి ఈనుతుండడంతో రైతుల నుంచి వివరాలు సేకరించి నమోదు చేసుకున్నారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని శాస్త్రవేత్తలు శ్రీధర్, సంధ్యారాణి, రాములమ్మ తెలిపారు. కార్యక్రమంలో ఏఓ జావీద్, ఏఈఓలు స్నేహలత, అవినాశ్, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య : ప్రిన్సిపాల్

నడిగూడెం, ఫిబ్రవరి7: ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తున్నదని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయనాయక్ అన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో కళాశాలలో విద్యార్థుల నమోదు కోసం అధ్యాపకులతో కలిసి శుక్రవారం నడిగూడెం గురుకుల పాఠశాలలో ముందస్తు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాలలో విద్యార్థుల నమోదు శాతం పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ జానీపాషా, మహేశ్, వీరన్న, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, రజిత, మదార్, సుజాత, ధనుంజయ్, హేమ, నాగరాణి, రవివర్మ పాల్గొన్నారు.

'విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి'

విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న అకాడమీ చైర్‌పర్సన్ వసంతవెంకట్‌రెడ్డి

కోదాడ టౌన్, ఫిబ్రవరి 7: విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని రేస్ ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ చైర్‌పర్సన్ బాణాల వసంతవెంకటరెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో కోదాడ నియోజకవర్గ స్థాయిలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు శుక్రవారం కోదాడలోని రేస్ ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీలో బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు భవిష్యత్తులో పోటీ పరీక్షలపై ఆసక్తి కలిగేలా టాలెంట్ టెస్ట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మనబోయిన నరేశ్, బహుమతుల దాతలు పింద్రాతి హనుమంతరావు, సిరాపరపు శ్రీనివాసరావు, అంబాల వెంకటి, త్రివేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిరికొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల పాఠశాలలో ఆరోగ్య అవగాహన సదస్సు

అవగాహన కల్పిస్తున్న గైనకాలజిస్ట్ శిరీష

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 7: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ గైనకాలజిస్ట్ శిరీష ఆధ్వర్యంలో యుక్త వయస్సులో బాలికలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం జయప్రద, ఉపాధ్యాయులు శైలజ, ఆర్.విజయ, జానీ బేగం, వనజ, పీఈటీ జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రాంపురంలో ఉచిత పశువైద్య శిబిరం

మందులను పంపిణీ చేస్తున్న ఉత్తమ్‌సింగ్

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 7: స్థానిక మైహోం సిమెంట్ ఇండస్ట్రీస్, పశుసంవర్ధకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని వెంకట్రాంపురం గ్రామంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ప్లాంట్ వైస్ ప్రెసిడెంట్ ఉత్తమ్‌సింగ్‌తో కలిసి జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాసరావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. పశువులకు చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. పరిశ్రమ జీఎం నాగేశ్వర్‌రావు, డీజీఎం అప్పలరాజు, ఏజీఎం శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

చౌటపల్లిలో 9న వైద్య శిబిరం

మఠంపల్లి: మండలంలోని చౌటపల్లి గ్రామంలో మేళ్లచెర్వు మైహోం సిమెంట్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పరిశ్రమ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి చౌటపల్లి ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు, పెద్దలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించనున్నట్లు తెలిపారు.

'టీబీ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి'

శిబిరంలో టీబీ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 7: ఉచిత టీబీ నిర్ధారణ పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 48వ వార్డు మాజీ కౌన్సిలర్ వెలుగు వెంకన్న అన్నారు. శుక్రవారం పట్టణంలోని 48వ వార్డు కోట మైసమ్మ బజార్‌లో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత టీబీ, బీపీ, షుగర్ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పెద్దాసుపత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోలేని పేదలకు ఈ శిబిరం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. శిబిరంలో టీబీ పరీక్షలను చేయించుకోవాలని, పాజిటివ్ వచ్చిన వారికి మూడు నెలల పాటు మందులు ఉచితంగా అందిస్తారని తెలిపారు. టీబీ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలని, లేనిపక్షంలో శరీరమంతా వ్యాపించి జీర్ణ వ్యవస్థను దెబ్బతీస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శివప్రసాద్, సూపర్‌వైజర్ ఏకస్వామి, ల్యాబ్ టెక్నీషియన్ సుష్మ, ఏఎన్ఎం చిలకమ్మ, ఆశ కార్యకర్తలు విజయ, మణెమ్మ, పి.శ్రీలత, బి.శ్రీలత పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌తో రైతులకు ఒరిగిందేమీ లేదు : సీపీఎం

నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం శ్రేణులు

గరిడేపల్లి, ఫిబ్రవరి 7: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో రైతులకు ఒరిగిందేమీ లేదని సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకూబ్ విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్ రైతులు, కార్మికులు, నిరుద్యోగులకు వ్యతిరేకంగా ఉందని, బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ రైతులను పట్టించుకోవడం లేదన్నారు. బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు పోరాడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల సైదయ్య, భిక్షం, కేనాల సుశీల, సారెడ్డి సైదిరెడ్డి, యమగాని వెంకటేశ్వర్లు, సోమయ్య, శ్రీనివాస్, సైదిరెడ్డి, మండవ సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను బకాయిలను చెల్లించాలి : మున్సిపల్ కమిషనర్


ఇంటి పన్ను వసూలు చేస్తున్న మున్సిపాలిటీ ప్రత్యేక బృందం

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 7: ప్రజలు ఇంటి పన్నులు, నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల బకాయిలను వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో పన్ను వసూళ్ల నిమిత్తం ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేయగా, శుక్రవారం మొండి బకాయిదారుల ఇండ్లకు వెళ్లి పన్నులు వసూలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. బకాయి చెల్లించని పక్షంలో మున్సిపల్ చట్టం ప్రకారం ఇంటిని జప్తు చేయడం జరుగుతుందన్నారు. అలాగే ఇంటి నల్లాను శాశ్వతంగా తొలగిస్తామని, కాబట్టి వెంటనే మున్సిపాలిటీ పన్ను బకాయిలను చెల్లించాల్సిందిగా కోరారు.

'నులి పురుగులను నివారిద్దాం'

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారి నాగిని

నేరేడుచర్ల, ఫిబ్రవరి 7: పిల్లల్లో నులి పురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నేరేడుచర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి పున్న నాగిని కోరారు. ఈ నెల 10వ తేదీ నుంచి నిర్వహించే జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంపై శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు, అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నులి పురుగుల నివారణకు 1 నుంచి 2 ఏళ్ల వయస్సు పిల్లలకు ఆల్బెండజోల్ సగం మాత్ర, 2 నుంచి 19 ఏళ్ల వయస్సు వారికి ఒక ఆల్బెండజోల్ 400 ఎంజీ మాత్ర వేయాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సల్వాది శ్రీనివాస్, సూపర్‌వైజర్ నర్సయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

అర్వపల్లి, ఫిబ్రవరి 7: రెండో యాదాద్రిగా పేరొందిన అర్వపల్లి యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నేటి నుంచి 18 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. 8న తొళక్కం, 9న అధ్యయనోత్సవం, 10న పరమపదోత్సవం, 11న ధ్వజారోహణం, 12న కల్యాణోత్సవం, 13న గురుపూజోత్సవం, 14న రథోత్సవం, 15న చక్రతీర్థం, 16న పొన్నోత్సవం, 17న హనుమంత సేవ, 18న హంస వాహన సేవ, 19న గజవాహన సేవ, 20న శేషవాహన సేవ, 21వ దేవరాజు వాహన సేవ, 22న పారువేట, 23న దొంగల దోపు వసంతోత్సవం, 24న డోలోత్సవం నిర్వహించనున్నారు. 25న ఉత్సవమూర్తులను జాజిరెడ్డిగూడెం దేవాలయానికి తీసుకెళ్లడంతో బ్రహ్మోత్సవాలు సమాప్తం కానున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దేవాదాయ శాఖ అధికారులు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈసారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుర్తి వెంకటరెడ్డి తెలిపారు. ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నప్రసాద వితరణ, క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

నేరేడుచర్ల, ఫిబ్రవరి 7: నేరేడుచర్ల పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో శుక్రవారం ఆటో బోల్తాపడి ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దిర్శించర్ల గ్రామానికి చెందిన 8 మంది కూలీలు అదే గ్రామానికి చెందిన ఆటోలో గరిడేపల్లి మండలం పొనుగోడులో ఇంటి నిర్మాణ పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా హుజూర్‌నగర్ రోడ్డులోని శివాలయం ఆర్చి వద్ద ఆగి ఉన్న బస్సును తప్పించపోయి ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వేముల రామయ్య, ఉప్పి మంగమ్మ అనే ఇద్దరికి గాయాలు కాగా, స్థానికుల సాయంతో 108 అంబులెన్స్‌లో మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి.

'రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం'

గరిడేపల్లి, ఫిబ్రవరి 7: కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేస్తున్నదని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు విమర్శించారు. మండలంలోని కాల్వపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సీపీఐ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు రుణమాఫీ కోసం బ్యాంకులు, వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు చెవ్వా వెంకన్న, సాగి సరోజనమ్మ, సైదులు, లింగరాజు, వెంకన్న పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా : ఏఓ

ఆత్మకూర్.ఎస్, ఫిబ్రవరి 7: రైతులకు తగినంత యూరియా అందుబాటులో ఉన్నదని మండల వ్యవసాయాధికారి డి.దివ్య అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో యూరియా నిల్వలను ఆమె తనిఖీ చేశారు. నెమ్మికల్, ఏపూర్ పీఏసీఎస్‌లలో తగినంత యూరియా ఉందన్నారు. రైతులు సీజన్ మొత్తానికి ఒకేసారి కాకుండా విడతల వారీగా యూరియా కొనుగోలు చేయాలని సూచించారు.

'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలి

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 7: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదీన నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో చలో హైదరాబాద్ కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజాపాలన అని తెలంగాణలో గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి నేడు సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. ప్రభుత్వ పథకాల అమలులో అర్హులకు న్యాయం చేయాలని అన్నారు. కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో ఇప్టూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ప్రకారమే జాతర నిర్వహించాలి : ఎస్ఐ

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ రాంబాబుగౌడ్

చిలుకూరు, ఫిబ్రవరి 7: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నిబంధనల ప్రకారమే జెర్రిపోతులగూడెం గ్రామంలో కనకదుర్గమ్మ జాతర నిర్వహించుకోవాలని ఎస్ఐ రాంబాబుగౌడ్ సూచించారు. శుక్రవారం గ్రామంలో అఖిల